క్లుప్తంగా

శావల్యాపురం పశువైద్యాధికారిగా కావ్య



శావల్యాపురం: స్థానిక పశువైద్యశాల వైద్యాధికారిగా నూతనంగా జర్మి కావ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి రూరల్ మండలం అంగలూరులో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కావ్యను పశువైద్యశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన పశువైద్యాధికారి సోముల గుణధీర్ సాధారణ బదిలీపై నంబూరు పశువైద్యశాలకు వెళ్లారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్ కారుమంచి, వేల్పూరు పశు వైద్యశాల్లో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా చంద్రశేఖర్



నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా ఎస్.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా గూడూరు తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై నాదెండ్లకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏవీ రమణ నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి–సెక్షన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. యడ్లపాడు మండలం నుంచి డిప్యూటేషన్‌పై నాదెండ్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏవీ రమణ కేవలం ఎనిమిది నెలల్లోనే బదిలీ కావటంపై రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగానే బదిలీ జరిగినట్లు సమాచారం.

తలరాతలు నిర్ణయించేది ఓటు హక్కే



చిలకలూరిపేట: మన తలరాతలు నిర్ణయించేది ఓటు హక్కు అని... ఓటు అమ్ముకుంటే భవిష్యత్తు లేనట్టేనని తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ చెప్పారు. పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో శనివారం నా ఓటు–నా హక్కు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు యోగా అవసరం



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రైవర్లకు యోగా తప్పనిసరి అని జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం పక్కనే ఉన్న రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో డ్రైవర్లకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంజీవ్ కుమార్ డ్రైవర్లకు యోగాపై అవగాహన కల్పించారు. రీసెర్చ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ డి.నాగేశ్వరరావు రోడ్ సేఫ్టీ ఎన్జీవో సభ్యులు ఆర్.బంగారయ్య, డ్రైవర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం

మాచర్ల: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దుర్గి మండలంలోని 33/11, అడిగొప్పల, ధర్మవరం, దుర్గి, కోలగుట్ల సబ్ స్టేషన్‌లను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్, డొమెస్టిక్ దరఖాస్తులు, ఎస్సీ, ఎస్టీ కాకుండా ఉన్నటువంటి సర్వీసులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. వలంటీర్, అడిషనల్ లోడ్ ఫర్ 55 శాతం రాయితీకి ఈ నెల 30లోపు అవకాశముందని చెప్పారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరారు దుర్గి సబ్ స్టేషన్‌లో ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతలపాటి సింగయ్య, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్యతో కలిసి మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడారు.

రేపు 'యువత పోరు' విజయవంతం చేయండి

- మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు
- కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగభృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ డిమాండ్
- పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే యువతపోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ యువత, విద్యార్థి విభాగాల నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలమైనప్పటికీ ఇప్పటి వరకు యువతకు ఇస్తామన్న 20 లక్షల ఉద్యోగాలు కల్పించలేకపోయారన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి నిరుద్యోగ యువకుడికి ఉద్యోగ అవకాశం కల్పించే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంత వరకు విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించలేదని, ఈ కారణంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. అందువల్ల తక్షణమే ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 23న స్థానిక లింగంగుంట్లలోని జిల్లా పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వరకు పార్టీ యూత్, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వటం జరుగుతుందన్నారు.

జిల్లాలోని అన్ని విద్యార్థి, యువత విభాగాలు, అన్ని విభాగాల వారు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చి శివకోటి, పార్టీయూత్ అధ్యక్షులు కందుల శ్రీకాంతరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్, సోషల్ మీడియా వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు భూదాల కళ్యాణ్, స్టూడెంట్ నాయకుడు వేణు, నాయకులు శివరాత్రి అశోక్, పార్టీ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీని గెలిపించుకుందాం

- అందరమూ సిద్ధంగా ఉందాం
- నూతన పార్టీ పట్టణ అధ్యక్షులు, శ్రేణులకు సూచించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నూతన పట్టణ అధ్యక్షులతో డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. పార్టీ పురపాలక పట్టణ అధ్యక్షులుగా నియమితులైన షేక్ కరిముల్లా తన మద్దతుదారులతో శనివారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తన నియామకానికి సహకరించినందుకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి పట్టణ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు, అందుకు సహకరించిన డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలను అన్ని వర్గాల వారిని కలుపుకొని పట్టణ అధ్యక్షుడిగా తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు.

డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పట్టణ అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నిడమానూరు సురేంద్ర, అచ్చి శివకోటిలను నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీరందరూ పార్టీ ఏర్పడిన నాటి నుంచి కష్టపడి పని చేసే వారని, ఇప్పుడు కూడా పదవులు తీసుకుని పట్టణ కమిటీ వేసి అన్ని వార్డుల్లో కమిటీలను నియమించి అందర్నీ కలుపుకొని పోయి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీ ఎక్కడైతే బలహీనంగా ఉందో అక్కడ తిరిగి బలం పుంజుకునేందుకు కృషి చేయాలని సూచించారు. గిరిజన, మాదిగ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వర రావు, కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, పట్టణ బీసీ విభాగ అధ్యక్షులు మర్రిపూడి రాంబాబు, మహిళా నాయకురాలు అనీల, అన్ని వార్డుల ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా నియమింపబడ్డ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

యోగ్యమైన ఆసనాలు వేసి..

- అందరినీ ఆశ్చర్య పరచి...
- ఉత్సాహంగా యోగాసనాలు వేసిన జనం
- వాడవాడలా ఘనంగా యోగా దినోత్సవం



చిలకలూరిపేట ఏఎంజీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, పెద్దలు



వినుకొండలో యోగాసనాలు వేస్తున్న పురప్రముఖులు

చిలకలూరిపేట: ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రశాంతంగా జీవించేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు బజార్ ఎదురు రోడ్డుపై అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

వినుకొండ: వినుకొండ పురపాలకసంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగాడే సందర్భంగా 1000 మందికి పైగా ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది.యోగా కార్యక్రమంలో పాల్గొని ఆసనాలు వేశారు.మున్సిపల్ కమిషనరు సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌నాయక్‌తోపాటు పలువలు ప్రముఖులు పాల్గొని యోగాపట్ల అవగాహన కల్పించారు.

నరసరావుపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ప్రకాష్‌నగర్‌లోని సీబీఐటీ స్కూలులో యోగా దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ యోగిరెడ్డి, ప్రిన్సిపాల్ భారతి వెల్లడించారు.

నాదెండ్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాడే నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, హెచ్ఎం నిర్మల, మండల, గ్రామస్థాయి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పరికల్ప యోగి కూనిశెట్టి జనార్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం విధానాలపై శిక్షణ ఇచ్చారు. యోగా వలన శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ పొందవచ్చని తెలిపారు.

నరసరావుపేట: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు పట్టణంలోని ప్రకాష్‌నగర్ సాయిషా యోగ సెంటర్ ఆధ్వర్యంలో ఏవన్ కల్యాణ మండపంలో శనివారం ప్రముఖ విద్యావేత్త ఈఎం స్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, విశిష్ట అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, నల్లపాటి రామచంద్రప్రసాద్, మేడికొండ కబ్బిరెడ్డి, సాయి సాయి క్షేత్ర నిర్వాహకులు మురారిశెట్టి గోపాలబాబు హాజరై యోగ సాధకులను ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశంలో ఇచ్చారు. అలాగే స్థానిక శ్రీ సుబ్బరాయ– నారాయణ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, 23 (ఏ) బీఎన్ ఎన్‌సీసీ చీరాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగాల వారి ఉత్తర్వుల మేరకు యోగా ఫర్ ఒన్ ఎర్త్, ఒన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా హాజరయ్యారు.



నరసరావుపేటలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

శావల్యాపురం: యోగా చేయడం వల్ల చక్కని ఆరోగ్యం ఏర్పడుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా జాతీయ దినోత్సవ వేడుకలు ముగింపు వేడుకల సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయి అధికారులు యోగాసాల కార్యక్రమం నిర్వహించారు.

యడ్లపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యడ్లపాడు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలం పరిధిలోని గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో వీటిని వేకువ జామునే నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

నేడు యడ్లపాడులో రెండు వైద్యశిబిరాలు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆదివారం రెండు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు బాసట స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు, కోశాధికారి కేతా రామబ్రహ్మం తెలిపారు. ఉదయం 6 గంటలకు స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో బాసట సామాజిక, సాంస్కృతిక వేదిక, జీబీఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధులకు వైద్యశిబిరం ఉంటుందన్నారు. మర్ని వివరాలకు సెల్‌నం: 94900 99991, 82470 01265, 99083 99169కు సంప్రదించాలన్నారు.

మెగా కంటి వైద్యశిబిరం...

స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో గుంటూరుకు చెందిన ప్రసిద్ధ సుదర్శని కంటి ఆసుపత్రి, గుంటూరు వైద్యుల సహకారంతో ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మధ్యాహ్నం 12:30 గంటల లోపు పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే సేవలు లభిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ జిరాక్స్ కాపీలు తీసుకురావలసిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలి

అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్



సంతకాల సేకరణ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: సూపర్ సిక్స్‌లో భాగమైన నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నిరుద్యోగులకు భృతి చెల్లించకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. దీనికి తోడు నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ ఇప్పించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రవి, వెంకటేష్, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఓవర్ లోడ్‌పై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: పరిమితికి మించి ప్రయాణికులను రవాణ చేస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ వంశీ కృష్ణ శనివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో అతివేగంగా ప్రమాదకరంగా వెళ్తూ పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ జొన్నలగడ్డకు చెందిన కుందా ఏసురత్నంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

సంధ్యారాణి మృతికి కారకులను అరెస్టు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరించిన కేఎన్‌పీఎస్ నాయకులు



కపత్రాలు ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన చప్పిడి సంధ్యారాణి మృతికి కారణమైన ఆమె భర్త, అత్తమామలపై 304(బి) సెక్షన్ అమలుచేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పోలీసు ఉన్నతాధికారులను కోరారు. దీనిపై శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సంధ్యారాణిని అధిక కట్నం తీసుకురావాలని శారీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేయడమే కాకుండా ఆమెపై దొంగతనం చేసిందని అవమానించి, అనుమానించిన కారణంగా మనస్తాపం చెందిన సంధ్యారాణి గతనెల 24న ఒంటిపై డీజిల్ పోసుకొని తగులబెట్టుకుందన్నారు. ఆమెను తల్లిదండ్రులు గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా 43 రోజులు మృత్యువుతో పోరాడి ఈనెల 5న మరణించిందన్నారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు నామమాత్రపు సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు ఆందోళన చేసిన తర్వాత 306 సెక్షన్‌గా ఆల్టర్ చేశారన్నారు. నిందితులను కాపాడుతున్న కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు నిర్లక్ష్యం వైఖరిని ఖండిస్తూ వచ్చే సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్నప్రసాదు, సహాయ కార్యదర్శి అక్కా బ్రహ్మయ్య, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

శావల్యాపురం సర్వేయర్‌గా నాగరాజు నాయక్

శావల్యాపురం: మండల సర్వేయర్‌గా నూతనంగా నాగరాజు నాయక్ నియామకమైనట్లు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ శనివారం తెలిపారు. ఆయన మంగళగిరిలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ రాజు సోమవారం రిలీవ్ అవ్వనున్నారు.

గణపవరం బిల్‌కలెక్టర్‌గా కరీంబాషా

నాదెండ్ల: మేజర్‌పంచాయతీ గణపవరం గ్రామంలో ఐదేళ్ళుగా ఖాళీగా ఉన్న బిల్‌కలెక్టర్ పోస్టు భర్తీ అయింది. ఈ మేరకు శనివారం చేబ్రోలు పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కరీంబాషా బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వట్టిచెరుకూరు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేరీసుజాత బదిలీపై ఇక్కడకు వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించారు. ఈపూరు మండలం, ఈపూరు గ్రామానికి చెందిన గంజనబోయిన శ్రీకాంత్(23) గా గుర్తించినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. శ్రీకాంత్ మృతదేహానికి నరసరావుపేట ఏరియా వైద్యశాలలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

ఎస్సీ కాలనీలో భూ సమస్యల పరిష్కారానికి దీక్ష

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులోని ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జంగాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ తరపున శనివారం పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... లక్కరాజు గార్లపాడు గ్రామసెంటర్ సర్వే నెంబర్ 114లో బావి పోరంబోకు ఆరు సెంట్ల భూమి ఉందని, సర్వే నెంబర్ 115లో ఎస్సీ కాలనీ రోడ్, ఆర్ అండ్ బీ రోడ్డుకు కనెక్షన్ ఉందన్నారు. సర్వే నెంబర్ 131లో గ్రామకంఠ భూమి ఉందని చెప్పారు. ఆ మూడు రకాల భూమిని కలుపుకోవడానికి తమ గ్రామంలో నలుగురు వ్యక్తులు కుట్రలు చేస్తూ ఎస్సీ కాలనీ వాసులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, డీఆర్ఓ సూచనల మేరకు సత్తెనపల్లి ఆర్డీవో ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

దీనిపై ఆర్డీవో, తహసీల్దార్ సంయుక్తంగా కలిసి గ్రామంలో విచారణ జరిపారన్నారు. ఆ భూమి ప్రభుత్వానికి చెందిందని, ప్రైవేట్ వ్యక్తులు ఎవరికీ సంబంధం లేదంటూ అక్కడ గ్రావెల్ తోలిన వ్యక్తితో మాట్లాడి వివాదం లేకుండా చేసి, పంచాయతీ కాలువ, పంచాయతీ రోడ్డు కలుపుకొన్న వ్యక్తులకు చెప్పి గ్రావెల్ తీయించాలని సత్తెనపల్లి ఈఓపీఆర్డీకి సూచన చేశారన్నారు. కానీ ఈ ఆదేశాల అమలులో జాప్యం దేనికి సంకేతమని నిలదీశారు. ఎస్సీలు అంటే చిన్న చూపా? అని ప్రశ్నించారు. జంగాల శ్రీనివాసరావుకు మద్దతుగా జొన్నలగడ్డ వెంకట్రావు, వెల్లటూరు మరియదాసు, జొన్నలగడ్డ మదన్, యరసాని జయరావు, ముప్పవరపు నాగరాజ్, జొన్నలగడ్డ ఏసోబు, జొన్నలగడ్డ లింగయ్య, జొన్నలగడ్డ చంటిలు రిలే నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 114లో 6 సెంట్లు బావి పోరంబోకు స్థలాన్ని డాక్టర్ అంబేడ్కర్ పేరుతో గ్రంథాలయానికి కేటాయించాలని కోరారు. సర్వే నెంబర్ 115లో గ్రామ సెంటర్ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ రోడ్డు గ్రామపంచాయతీ సైడ్ కాలువను కలుపుతూ గ్రావెల్ మట్టితో పూడ్చిన దాన్ని పూర్తిగా తొలగించాలన్నారు. గ్రామ సెంటర్ ఎస్సీ కాలనీ రోడ్డుకు అనుకున్న పంచాయతీ రోడ్డు అనగా శీలంనేని సాంబయ్య ఇంటి ముందు గల పంచాయతీ రోడ్డు కలుపుతూ గ్రావెల్ మట్టి తోలించారని చెప్పారు.

• బస్టాండేగా... ఆక్రమిస్తే పోలా...!!



మండల కేంద్రమైన రొంపిచర్లలో ఉన్న బస్ స్టేషన్ చిరువ్యాపారులకు, మోటార్ సైకిళ్లకు పార్కింగ్ స్థలంగా మారింది. రొంపిచర్లకు వెళ్లే ప్రతి ఆర్టీసీ బస్సు బస్ స్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లాల్సి ఉంది. అయితే బస్‌స్టాండ్‌కు బస్సులు వచ్చే సమయానికి ప్రైవేటు వాహనాలు, మిఠాయి బండ్లు, మోటారు సైకిళ్లతో నిండుగా ఉండటంతో బస్సులు వచ్చేందుకు వీలుగా లేదు. దీంతో బస్‌లో ఎక్కి ప్రయాణం చేయాల్సిన ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల రాకపోకల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైవర్, కండక్టర్‌లను బస్సులు బస్ స్టేషన్‌కు ఎందుకు వెళ్లడం లేదని ప్రయాణికులు అడిగితే అక్కడ జాగాలేనందు వల్ల స్టేషన్‌కు వెళ్లలేక పోతున్నామని వారు చెబుతున్నట్లు తెలుపుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు, అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఆక్రమణలను తొలగించి రొంపిచర్లకు వచ్చే ప్రతి ఆర్టీసీ బస్సు బస్ స్టేషన్‌కు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల ప్రతినిధి వి. శివరామయ్య అధికారులను కోరారు.

–రొంపిచర్ల

రేపు మెగా జాబ్ మేళా

మాచర్ల: గ్లోరియా ఆఫ్ ఆసియా అవార్డు పొంది, ఐ.ఎస్.ఓ సర్టిఫైడ్ సంస్థ వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ సాంబేలు శాంతిబాయి శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్ల లోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. టెక్ మహేంద్ర, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్, కోటక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, మెట్రో, పేటీఎం, జస్ట్ డయల్, బ్లింక్ ఇట్, కాప్సోన్, అక్షర ఎంటర్‌ప్రైజెస్, షైనీడార్ ఎలక్ట్రానిక్స్ వంటి ప్రతిష్టాత్మకమైన కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలో విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ సెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9885398475,8142656530 సంప్రదించాలని కోరారు.